సాక్షి
కాకినాడ

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



రూ.50,116 విరాళం

ఆలమూరు: చింతలూరు నూకాంబిక ఆలయ గోపురాల అభివృద్ధికి గ్రామస్తులు ఈదర వెంకట్రావు, అనంతలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు.



మిత్రోత్సాహం..

స్నేహం.. సృష్టిలో మధురమైంది.. జీవితంలో మరువలేనిది.. ఆత్మీయతను పంచేది.. ఆహ్లాదాన్ని అందించేది.. అక్షరాలకతీత మైన పుస్తకం లాంటిది.. భారమైన హృదయానికి ఓదార్పునిస్తుంది.

8లో



సముద్రంలోకి 3.28 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 3,28,230 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టాలకు 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటిమట్టం ఉంది.

న్యూస్‌రీల్

4న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ కె.లచ్చారావు శనివారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జేజీఆర్ హాస్పిటల్‌లో పీఆర్‌వో, నర్సింగ్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, వెంకీ రెసిడెన్సీ త్రీ స్టార్ హోటల్‌లో మెయిన్‌టెనెన్స్ టెక్నీషియన్, కెప్టెన్, ఫ్రంట్ ఆఫీస్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజర్, అసోసియేట్, స్టీవార్డ్స్, రాయల్ ఇన్సూరెన్స్‌లో టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సిస్టమ్ ఆపరేటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, వియాష్ లైఫ్ సైన్సెస్, జేకే ఫిన్నర్‌లో టెక్నీషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, బీఎస్సీ నర్సింగ్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. అలాగే డీడీయూ జీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా టూ వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు.

ఉత్సాహంగా జాతీయ జూనియర్ హాకీ పోటీలు



హోరాహోరీగా తలపడుతున్న తెలంగాణ, రాజస్థాన్ జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 15వ జాతీయ జూనియర్ బాలికల హాకీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరుగుతున్న ఈ పోటీలలో దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ ఉమ్మడి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 4–0 స్కోర్‌తో గోయన్స్ జట్టు, గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో మిజోరాం 9–0 స్కోర్‌తోను, తెలంగాణతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6–1 స్కోర్‌తోను విజయం సాధించాయి. పాండిచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో కేరళ 4–2 స్కోర్‌తో గెలుపొందింది. హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 4–2 స్కోర్‌తో గెలుపొందింది. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లను సీనియర్ పీఈటీ బంగార్రాజు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. టోర్నీ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు పోటీలను పర్యవేక్షించారు.

నకిలీ బంగారంతో రుణం

సామర్లకోట: స్థానిక జాతీయ బ్యాంకులో నకిలీ బంగారం తాకట్టు పెట్టి ఒక వ్యక్తి రూ.94 లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల బ్యాంకులో బంగారు ఆభరణాల తనిఖీ చేస్తుండగా నకిలీ బంగారాన్ని గుర్తించారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.కృష్ణ భగవాన్ శనివారం తెలిపారు. ఈ విషయం బయటకు రావడంతో బ్యాంకులలో బంగారం పెట్టిన వారు వారి వస్తువులను విడిపించుకున్నట్లు తెలిసింది.

భయో వ్యర్థాలు!

- పుట్టగొడుగుల్లా మెడికల్ ల్యాబ్‌లు
- జిల్లాలో వందల సంఖ్యలో అనధికారికంగా నిర్వహణ
- వ్యర్థాల నిర్వహణలో అలసత్వం
- ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



పాత బస్టాండ్ ఆవరణలో బయో మెడికల్ వ్యర్థాలు

కాకినాడ క్రైం: జిల్లాలో వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ల్యాబొరేటరీలలో కొన్ని ప్రజారోగ్యానికి ప్రాణ సంకటంగా పరిణమిస్తున్నాయి. అనుమతులు తీసుకునేందుకు వెనకాడి జనం జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్ లేకపోతే చవకధరల్లో ప్రమాదకర వ్యర్థాలైన బయో మెడికల్ వేస్టేజీ తొలగింపు సాధ్యం కాదు. నిర్ణీత ధరల కంటే రెండు రెట్లు ఎక్కువ ధరలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఆయా ల్యాబ్‌ల యాజమాన్యాలు ప్రమాదకర కుయుక్తులకు తెరతీశాయి. ప్రాణాంతకాలుగా పరిణమించే బయో మెడికల్ వ్యర్థాలను డంప్ యార్డులు, రోడ్డు పక్కన, డ్రైనేజీలు, చెత్తకుప్పల్లోకి విసిరేసి తమకేమీ తెలియనట్లు చేతులు దులిపేసుకుంటున్నారు. అనధికారికంగా కొనసాగుతున్న ల్యాబ్‌ల తీరు ఇంత దారుణంగా ఉంటున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. సాక్షాత్తూ, డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఉన్న చెత్త కుండీలలోనే బయో మెడికల్ వ్యర్థాలు దర్శనమిస్తుండడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ.

రిజిస్ట్రేషన్ చేయించుకుంటే

ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ల ఏర్పాటుకు ఓ నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. వాటికి ప్రభుత్వ అనుమతులు పొందాలి. అందుకు నిర్ణీత ప్రమాణాలు ఉంటేనే అనుమతులు వస్తాయి. సందుగొందుల్లో ఇరుకు గదుల్లో ల్యాబ్‌లు పెట్టేస్తామంటే కుదరదు. అలాగే రోగిని పరీక్షించి మీకు ఈ వ్యాధి ఉంది, స్థితిగతులివి అని నిర్ధారించే వ్యక్తి కచ్చితంగా తగిన విద్యార్హుడై ఉండాలి. అటువంటి వారికి అర్హతకు తగిన జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే వైద్య పరీక్షలు నిర్వహించే బయోకెమిస్ట్రీ, హార్మోన్స్, హెమటాలజీ అనలైజర్ల వంటి పరికరాలు 25 డిగ్రీల ఉష్ణోగ్రత మించని వాతావరణం కల్పించాలి. నమోదైన ప్రతి ల్యాబ్ బయో మెడికల్ వ్యర్థాల తొలగింపునకు ప్రభుత్వ అనుమతులు పొంది పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో సేవలందించే సంస్థకు ప్రతి నెల నిర్ణీత రూ.1680 మొత్తాన్ని చెల్లించి రోజువారీగా వాటిని అప్పగించాల్సి ఉంటుంది. ధర అందుబాటులోదే అయినా ఎంతో ఒకింత వ్యయంతో కూడిన ప్రక్రియ. ఆ మాత్రం ఖర్చుకైనా మనస్కరించని పలువురు ల్యాబ్ యజమానులు ప్రమాదకర వ్యర్థాలను చాటుగా విసిరేస్తూ, డ్రైనేజీలలో కలిపేస్తూ, డంప్ యార్డులకు తీసుకువెళ్లి సాధారణ వ్యర్థాల్లా తగిన జాగ్రత్తలు తీసుకోకుండా పడేస్తున్నారు.

ఎంతమందికి ఏ వ్యాధి ఉందో!

అనధికారికంగా నడిపే ల్యాబ్‌ల యజమానుల నిర్వాకంతో అసలు సదరు ప్రాంతంలో ఏ వ్యాధి విస్తరిస్తోందో.. ఎందరు ఏ వ్యాధితో సతమతమవుతున్నారో తెలుసుకోవడం దాదాపుగా అసాధ్యం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్‌లు, అనుమతి పొందిన ప్రైవేటు ల్యాబ్‌ల నుంచి వస్తున్న రిపోర్టుల ఆధారంగా మాత్రమే వ్యాధి విస్తరణపై నిర్ధారణ, బాధితుల సంఖ్యపై స్పష్టతకు రావలసి ఉంటుంది. వీటి ఆధారంగానే తుది గణాంకాలను సిద్ధం చేస్తున్నారు. ఈ గణాంకాలనే ప్రభుత్వ అధికారులు ప్రజలకు వెల్లడిస్తున్నారు. ఈ గణాంకాల్లో అనుమతులు పొందని ల్యాబ్‌లు నిర్వహించే పరీక్షల వివరాలు ఉండవు. దీంతో అధికారులు చెప్పే గణాంకాలు అవాస్తవాలయ్యే అవకాశం ఉంది. కాకిలెక్కల్ని కూడా కచ్చితమైనవని నమ్మాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అనధికార ల్యాబ్‌లలో గుర్తిస్తున్న బాధితుల సంఖ్యపై అధికారుల వద్ద ఏ లెక్కా లేదు.

అనుమతులు లేనివే ఎక్కువ

జిల్లా వ్యాప్తంగా ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్ల అంశం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అసలు కంటే నకిలీ రెండొందల శాతం ఎక్కువగా కొనసాగుతుండడం అధికారుల నిబద్ధతను ప్రశ్నిస్తోంది. ఏ విభాగం అయినా అసలు కంటే నకిలీ అధికమనే స్థితి ఉండదు. అసలులో ఇన్నో అన్నో నకిలీలు చేరడం చూస్తుంటాం. కానీ ఆశ్చర్యకరంగా అనుమతి పొందిన ల్యాబ్‌లు జిల్లాలో 116 మాత్రమే ఉంటే అనధికారికంగా కొనసాగుతున్న ల్యాబ్‌లు 224 ఉన్నాయి. ఈ మొత్తం కలిపితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ల్యాబ్‌ల సంఖ్య 340. ఇవి కాక మరో 12 దరఖాస్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద అనుమతులు పొందేందుకు సిద్ధంగా ఉన్నాయి.





డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట ఆరుబయటే విసిరేసిన సూదులు, రక్త నమూనాలు

కార్పొరేట్ ల్యాబ్‌ల ఘనకార్యమిదీ..

స్థానిక ల్యాబ్‌ల నిర్వాకం ఇలా ఉంటే, వైద్య ఆరోగ్య పరీక్షలను కార్పొరేట్ ల్యాబొరేటరీలు శాసిస్తున్నాయి. మెట్రో నగరాల్లో బ్రాంచ్‌లు పెట్టి స్థానికంగా కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. శాంపిల్ కలెక్టర్‌ను నియమించి ఆ వ్యక్తి ద్వారా స్థానిక కలెక్షన్ పాయింట్లను నమూనాలను తీసుకు వస్తారు. కొన్ని పరీక్షలు అక్కడే నిర్వహిస్తారు. మరికొన్నింటిని ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. స్థానికంగా నిర్వహించే ఏ కలెక్షన్ పాయింట్‌కూ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అనుమతులు లేవు. రక్తం, మల మూత్రాలు, కళ్లె, సూదులు, దూదులు ఇలా బయోమెడికల్ వ్యర్థాలను ఏం చేస్తారో అన్నదే ఇక్కడ మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏమవుతున్నాయో తెలియడం లేదు.

అంతా లాలూచీయేనా!

అనుమతులు లేని ల్యాబ్‌లు ఇష్టానుసారంగా జనాల్ని దోచేస్తుంటే, అధికారులకు చీమకుట్టినట్లు అయినా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ తీరుపై ల్యాబ్ యాజమాన్య వర్గాల్లోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అనధికార ల్యాబ్ నుంచి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖలో పలువురు సిబ్బంది అధికారుల నిర్వాకాన్ని బయటపెడుతున్నారు.

ప్రజలు జాగ్రత్త



రైల్వే స్టేషన్ సమీపంలో చెత్త కుప్పపై బయో మెడికల్ వ్యర్థాలు

అనుమతులు లేని ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటే పరీక్షల నివేదికల్లో తేడాలు వచ్చే అవకాశం ఉంది. ధరలు, డిస్కౌంట్ల ఎరతో ప్రజల్ని ఆకర్షిస్తున్నారు. కాగా అనుమతులు ఉన్న ల్యాబ్‌లలో రోగి వివరాలు నమోదవుతాయి. అలాగే నివేదికల్లో అనుమానాలు ఉన్నా నేరుగా యంత్రం వద్దకు వెళ్లి సరిచూసుకోవచ్చు. ఈ సౌలభ్యం అనధికార ల్యాబ్‌ల వద్ద ఉండదు. శీతల వాతావరణం తగినంత లేకపోయినా ఉష్ణోగ్రత ఎక్కువైతే ఆ యంత్రం ఇచ్చే నివేదికల్లోనూ కచ్చితత్వం లోపించవచ్చు. కాబట్టి ప్రజలు ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకునేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. తాము వెళ్లిన ల్యాబ్ అనుమతులు చూపించమని అడిగేందుకు ఎటువంటి మొహమాటం అవసరం లేదు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్ల విద్యార్హతల పైనా ఆరా తీయాలి.

ప్రాణాంతకంగా వేస్టేజీ



బయో మెడికల్ వేస్టేజీని సమర్థవంతంగా నిర్వహించకపోతే ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించే ప్రమాదం ఉంది. హెపటైటిస్ బి, సి, హెచ్ఐవి, ట్యూబర్క్యులోసిస్, చర్మవ్యాధులు, గ్యాస్ట్రో ఇంటస్టైనల్ ఇన్‌ఫెక్షన్లు, సెప్సిస్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. ఇవి ప్రాణాంతకం. నిర్దిష్ట అనుమతులు పొంది మాత్రమే ల్యాబ్‌లు నిర్వహించాలి. వాడిన సూదులు, రక్తంతో నిండిన గాజు వస్తువులు, శస్త్రచికిత్స పరికరాలు, పాడైపోయిన మందులు హాని కలిగిస్తాయి. ప్రజలు ఇటువంటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. పరీక్షలు చేయించుకునేటప్పుడు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న ల్యాబ్‌లను మాత్రమే ఎంచుకోవాలి.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, విశ్రాంత సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

రిజిస్ట్రేషన్ డ్రైవ్ నిర్వహించాలి



ల్యాబ్ రిజిస్ట్రేషన్ల కోసం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. బయో మెడికల్ వ్యర్థాలను సేకరిస్తున్న సంస్థ ధరలు నియంత్రించాలి. ఈ విషయాన్ని విన్నవిస్తూ ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించినా ఫలితం లేకపోయింది. అనధికారికంగా ల్యాబ్‌లు నడపడాన్ని సంఘం తరఫున ప్రోత్సహించం. ఈ చర్యలు ప్రజలకు ప్రాణసంకటం. కార్పొరేట్ ల్యాబ్‌ల కార్యకలాపాలపై పర్యవేక్షణ కొనసాగాలి. పరీక్షల ధరల నియంత్రణకు నిర్దిష్ట విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించి అమలు చేయాలి.

– వెంకట్, అధ్యక్షుడు, కాకినాడ డిస్ట్రిక్ట్ మెడికల్ లేబొరేటరీస్ అసోసియేషన్

నీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు

- జేసీ రాహుల్ మీనా
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: జిల్లాలో కబ్జాకు గురైన వివిధ శాఖలకు చెందిన నీటి వనరుల ఆక్రమణలను తొలగించి జల వ్యవస్థల పటిష్టతకు సమష్టి చర్యలు చేపట్టాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కోర్టు హాలులో చెరువులు, కాలువలు, డ్రైన్లు, వాగులు తదితర నీటి వనరుల సంరక్షణపై జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి వనరుల ఆక్రమణలు, వాటివల్ల ఎదురయ్యే సమస్యల నివారణకు సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. మే నెలలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సూచనల మేరకు రికార్డుల ప్రకారం జిల్లాలో మొత్తం 21,185.95 ఎకరాల విస్తీర్ణంలో 2670 నీటి వనరులు ఉండగా 327 వనరులకు సంబంధించి 1,548 ఎకరాల విస్తీర్ణం ఆక్రమణకు గురైనట్లు గుర్తించగా, ఇప్పటి వరకూ 2.49 ఎకరాలలోని ఆక్రమణలను తొలగించామని, మిగిలిన వాటి తొలగింపులకు చర్యలను ముమ్మరం చేయాలని జేసీ ఆదేశించారు. సోమవారం నాటికి డివిజన్ స్థాయిలోను, 15వ తేదీలోపు డివిజన్ స్థాయిలో రక్షణ కమిటీల సమావేశాలు జరిపి సర్వే నిర్వహణకు షెడ్యూల్‌ను సమర్పించాలని ఆదేశించారు. రానున్న నెల రోజుల్లో సర్వేలు పూర్తి చేసి వాటి విస్తీర్ణం, హద్దులను, ఏ శాఖకు చెందినవో వివరాలు ప్రకటిస్తూ అన్ని వనరుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, డీపీవో వి.రవికుమార్, పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరి కిటకిట

సత్యదేవుని దర్శనానికి 30 వేల మంది

అన్నవరం: రత్నగిరి శనివారం వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చి తిరుచ్చి వాహనంపై ప్రాకార సేవ నిర్వహించారు.

కాగా, రత్నగిరి ఆలయ ప్రాకారంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగించనున్నారు.

ఫోన్లు భద్రపరిచేందుకు రికార్డుస్థాయిలో వేలం

రత్నగిరికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్లు, కెమేరాలు భద్రపరచేందుకు శనివారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంపాట నెలకు రూ.8.11 లక్షలు చొప్పున ఏడాదికి రూ.97.32 లక్షలకు రికార్డు స్థాయిలో ఖరారైంది. సెల్‌ఫోన్ భద్రపర్చడానికి ఇప్పటి వరకు రూ.ఐదు మాత్రమే వసూలు చేయాలనే నిబంధన ఉండగా దానిని రూ.పదికి పెంచడంతో వేలంపాట భారీగా పెరిగింది. రూ.ఐదు వసూలుకు రెండేళ్ల క్రితం వేలం పాట నిర్వహించగా నెలకు రూ.3.31 లక్షలకు ఖరారైంది. కాగా ఆ వసూలు రూ.పది పెంచగా వేలం రెట్టింపు అంటే రూ.6.62 లక్షలు కావాలి. కానీ అంతకంటే ఎక్కువ మరో రూ.1.49 లక్షలు పెరిగింది. ఇలా ఏడాదికి ఖరారైన వేలం రూ.97.32 లక్షలపై 18 శాతం జీఎస్టీ కూడా వసూలు చేస్తారు. అంటే దాదాపు రూ.17.46 లక్షలు జీఎస్టీ చెల్లించాలి. అంటే ఏడాదికి సుమారు రూ.1.15 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది పదిశాతం పాట సొమ్ము పెంచాలి. దానిపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు భద్రపరచడానికి రూ.ఐదు మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా రూ.పది వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పాటదారులు అధికార పార్టీ వ్యక్తులు కావడంతో అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మిగిలిన పాటదారులు సెల్‌ఫోన్ భద్రపరిచేందుకు అన్ని దేవస్థానాలలో రూ.పది వసూలు చేస్తున్నారని, ఇక్కడ కూడా రూ.పది వసూలు చేసేలా వేలం నిర్వహించాలని వినతిపత్రం ఇచ్చారు. దాంతో ఆ మేరకు వేలం నిర్వహించారు. మరో నాలుగు అంశాలపై వేలంపాట వాయిదా వేశారు. వేలంపాటలో ఏఈఓ ఎల్.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న సత్యదేవుడు, అమ్మవారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పోలవరం గట్టుపై కాసుల వేట

- యథేచ్ఛగా చెలరేగిపోతున్న మట్టి మాఫియా
- కలవచర్లలో కాసులు కొట్టేస్తున్న కూటమి నేతలు
- రోజువారీ దందా రూ.25 లక్షల పైమాటే
- పేదల లే అవుట్ పేరుతో ముఖ్య నేత మేత!



వాహనాల రాకపోకలతో కలవచర్లలో ఛిద్రమైన రహదారి



కలవచర్లలో అర్ధరాత్రి టిప్పర్‌ను అడ్డుకుని ఆందోళనకు దిగిన స్థానికులు



కలవచర్లలో తరిగిపోతున్న పోలవరం కాలువగట్టు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గ్రావెల్ మాఫియా పేట్రేగిపోతోంది. అడ్డూ అదుపూ లేకుండా గ్రావెల్ అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో టీడీపీ, జనసేన నేతలు మూడు టిప్పర్లు.. ఆరు లారీలు అంటూ అక్రమంగా రూ.లక్షలు మింగేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్న కూటమి నేతలు చివరకు పోలవరం కాలువను కూడా విడిచిపెట్టడం లేదు. తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి కాకినాడ జిల్లా తుని మీదుగా విశాఖకు వెళ్తున్న పోలవరం ఎడమ కాలువ గట్టు కూటమి నేతలు కాసులు కురిపిస్తున్నాయి. ఇటు రాజానగరం, అటు జగ్గంపేట, తుని నియోజకవర్గాల పరిధిలో అధికార పార్టీ కీలక నేతలు తెర వెనుక ఉండి ద్వితీయ శ్రేణి నేతలతో ఆ కాలువ గట్టును గుల్ల చేస్తున్నారు. రాజానగరం నియోజకవర్గం కలవచర్ల, గాదరాడ తదితర ప్రాంతాల్లో పోలవరం కాలువ గట్టు స్థానిక జనసేన ముఖ్యనేతకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆ ముఖ్య నేత అండదండలతో అనుచరగణం అడ్డూ అదుపూ లేకుండా గడచిన నాలుగైదు నెలలుగా ఎర్రమట్టి, సుద్దమట్టి దందా నడుపుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ నేతలు గోదావరిలో ఇసుకను తోడేళ్ల మాదిరిగా తోడేస్తున్నా వారి దాహం తీరడం లేదు.

కలవచర్లలో పోలవరం, పుష్కర కాలువ గట్లను రాత్రీ, పగలు తేడా లేకుండా తవ్వేసి లక్షలు మింగేస్తున్నారు. ఈ రెండు ప్రధాన కాలువలకు ఇరువైపులా 30, 40 అడుగుల ఎత్తున ఉన్న గట్లను ఇష్టారాజ్యంగా తవ్వి, తరలించేసి ఆనక వాటాలు పంచుకుంటున్నారు. భారీ యంత్రాలను వినియోగించి ఎర్ర మట్టి, సుద్దమట్టిని తవ్వి రియల్ ఎస్టేట్ వెంచర్లు, నర్సరీలకు విక్రయిస్తున్నారు. గ్రావెల్ రూపంలో ఉన్న ఎర్రమట్టిని నర్సరీలకు తరలిస్తున్నారు. వెలుగుబందలో పేదల కోసం సేకరించిన భూముల మెరక కోసమనే వంకతో పోలవరం కాలువ గట్టును తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

కలవచర్ల నుంచి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరుపుతూ వస్తున్నారు. ఎటువంటి అనుమతీ లేకుండా పోలవరం గట్టు పొడవునా ఏడెనిమిది పొక్లెయిన్లు ఉపయోగించి 50 నుంచి 60 టిప్పర్లతో ఎర్ర గ్రావెల్‌ను అమ్మేసుకుంటున్నారు. ఒక టిప్పర్ రోజుకు ఆరేడు ట్రిప్పులు వేస్తోంది. ఇలా నిత్యం సుమారు 300 ట్రిప్పులు గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ దూరాన్ని బట్టి రూ.7 వేల నుంచి రూ.8 వేల వంతున విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు రూ.25 లక్షలు చేతులు మారుతున్నాయి. ఇలా వచ్చిన సొమ్ములో 40 శాతం నియోజకవర్గ జనసేన ముఖ్యనేతకు ముడుపుకట్టి ముట్టచెబుతున్నారని జిల్లా అంతటా కోడై కూస్తోంది. మిగిలిన 50 శాతంలో ఈ వ్యవహారాన్ని చక్కబెడుతున్న శ్రీరాంపురానికి చెందిన ముఖ్యనేత అనుచరుడు, స్థానిక అధికారులు సమానంగా వాటాలు వేసుకుంటున్నారని సమాచారం. ఇలా నాలుగైదు నెలలుగా సాగుతున్న దందా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లకుండా ఉంటుందా లేక, తెలిసినా పట్టించుకోలేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

కలవచర్ల నుంచి ఎర్రమట్టిని నర్సరీలకు ఎక్కువగా తరలిస్తున్నారు. వేమగిరి, కడియం, కడియపులంక, చొప్పెల్ల తదితర ప్రాంతాలలో నర్సరీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నర్సరీలతో పాటు రాజమహేంద్రవరం రూరల్ కాతేరు, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లోని లే అవుట్లకు ఇక్కడి నుంచి సుద్దమట్టిని తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఇన్ని నెలలుగా అనుమతి లేకుండా అక్రమంగా తవ్వేస్తున్న విషయం స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పెడచెవిన పెడుతూ వచ్చారు. చివరకు శుక్రవారం రాత్రి కలవచర్ల గ్రామస్తులు ఎదురు తిరగడం, కలెక్టర్ ప్రశాంతి చొరవతో గ్రావెల్ తవ్వకాలు వద్ద టిప్పర్లను సీజ్ చేయడంతో ప్రస్తుతానికి బ్రేక్ పడింది. కానీ వెలుగుబందలో పేదల ఇళ్ల స్థలాలు మెరక చేసే పని ఆగిపోతుందనే సాకుతో తిరిగి తవ్వకాల కోసం ఉన్నత స్థాయి నుంచి నియోజకవర్గ ముఖ్య నేత ఒత్తిళ్లు తీసుకువచ్చే ప్రయత్నాల్లో ఉన్నారని విశ్వసనీయ సమాచారం.

ఇదిలా ఉండగా తామేమైనా తక్కువ తిన్నామా అంటూ జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లో తమ్ముళ్లు కూడా ఇదే పోలవరం కాలువ గట్టును తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారిలో కూడా కలవచర్లలో మాదిరిగానే పోలవరం కాలువ గట్టును యథేచ్ఛగా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. మురారికి చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు గట్టు తవ్వే బాగోతాన్ని చక్కబెడుతున్నారు. మురారిలో కూడా ఆ పార్టీ ముఖ్య నేతల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతోంది. తుని నియోజకవర్గం వెలమ కొత్తూరు, లోవకొత్తూరుల్లో సైతం పోలవరం ఎడమ కాలువ గట్టుపై ఇదే దందా చాలా కాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఆ పచ్చనేతలు చక్కబెడుతున్నారు. ఆ పార్టీ ముఖ్యనేత కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోంది. తమ స్వార్థం కోసం పోలవరం ఎడమ కాలువ గట్లు బలహీన పరుస్తుండటాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే తవ్వకాలు జరుపుతూ పోతే భవిష్యత్తులో కాలువలకు గండ్లు పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

దళిత సర్పంచ్‌ను అవమానించారంటూ ఫిర్యాదు



డీఎల్‌పీఓ బొజ్జిరాజుకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సభ్యులు

అమలాపురం రూరల్: పేరూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని ఆ గ్రామ సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్ ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళా సర్పంచ్ కావడంతోనే స్థానిక నాయకులు తనకు సమాచారం ఇవ్వలేదని, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా సర్పంచ్ లేకుండా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పింఛన్లు పంపిణీ చేయడం దారుణమని ఆమె శనివారం డీఎల్‌పీఓ బొజ్జిరాజుకు ఫిర్యాదు చేశారు. ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీనివాసరావు, దొంగ ఆంజనేయులు, వార్డు సభ్యుడు అప్పారి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి నాగేశ్వరరావు తదితరులు డీఎల్‌పీఓకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ కార్యక్రమంలో సర్పంచ్ లేకుండా ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయడం సరికాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని వారు అన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



కాత్రావులపల్లిలో లోవరాజును అరెస్టు చేసిన జగ్గంపేట ఎస్సై రఘునాథరావు

జగ్గంపేట: కాత్రావులపల్లిలో పోలీసుల తనిఖీల్లో గంజాయితో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తన సిబ్బందితో శనివారం కాత్రావులపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కాత్రావులపల్లికి చెందిన కె.లోవరాజు అనే రాజేష్ ఎలియాస్ పటేల్ (37)ను అనుమానంతో అరెస్టు చేశారు. అతని వద్ద 4.38 కిలోల గంజాయి లభ్యమైంది. లోవరాజును పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందని సీఐ తెలిపారు.

మిత్రోత్సాహం..

- సోషల్ మీడియా వేదికగా బలపడుతున్న స్నేహం
- మనసుకు ఓదార్పునిస్తున్న బంధం
- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం



రాయవరం పాఠశాలలో విద్యార్థినికి ప్రోత్సాహకం అందిస్తున్న 2016 బ్యాచ్ పూర్వ విద్యార్థులు (ఫైల్)

రాయవరం: స్నేహం.. సృష్టిలో మధురమైంది.. జీవితంలో మరువలేనిది.. ఆత్మీయతను పంచేది.. ఆహ్లాదాన్ని అందించేది.. అక్షరాలకతీతమైన పుస్తకం లాంటిది.. భారమైన హృదయానికి ఓదార్పునిస్తుంది.. కష్టాల్లో ఆసరా అవుతోంది. ఇలా స్నేహం గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే స్నేహమేరా జీవితం ..స్నేహమేరా శాశ్వతమని అంటుంటారు. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొనేందుకు మిత్రులంతా సిద్ధమవుతున్నారు. సెల్‌ఫోన్ వినియోగం మనుషుల మధ్య సంబంధాలను మరింత దగ్గర చేసింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత సరికొత్త స్నేహాలు చిగురిస్తున్నాయి. సోషల్ మీడియా సమాచార వ్యాప్తిలో ప్రధాన భాగస్వామిగా నిలుస్తుంది. ఒకప్పుడు ఉత్తరాలు, తదుపరి ఫోన్‌లో మాట్లాడుకునే స్థాయి నుంచి సోషల్ మీడియా సాయంతో దేశ, విదేశాల్లో ఉంటున్న వారు సైతం వీడియో కాల్స్ ద్వారా సంభాషణలు సాగిస్తున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, మార్పులు చేర్పులను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులతో సామాజిక సంబంధాల్లో ఊహించని మార్పు వచ్చింది. 90 శాతం మంది మొబైల్ ఫోన్లలో మై ఫ్యామిలీ, టెన్త్ క్లాస్, ఇంటర్, డిగ్రీ పేర్లతో తప్పనిసరిగా వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. ఈ గ్రూపుల ద్వారా చిన్ననాటి స్నేహితుల నుంచి ఆఫీసులో కొలీగ్స్ వరకూ అందరూ నిత్యం టచ్‌లో ఉంటున్నారు. స్నేహితుల దైనందిన జీవితంలో జరిగే మంచి చెడులను ఎప్పటికప్పుడు పంచుకోవడమే కాదు, శుభాకాంక్షలూ చెప్పుకొంటున్నారు.

రెండు దశాబ్దాల నుంచి..

రాయవరంలో 2002లో తొలిసారి 1981–82 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా రాయవరంలో కలిసినట్లు చెబుతుంటారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా ప్రచారం కావడంతో ఇతర ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలకు నాంది పలికినట్లైంది. అప్పుడు ప్రారంభమైన పూర్వ విద్యార్థుల కలయిక దినదినప్రవర్ధమానమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఏటా సంక్రాంతి సమయాల్లో లేదా, వేసవి సెలవుల్లో, వివిధ సందర్భాల్లో కలుసుకుంటున్నారు.

ప్రతి సమాచారం వాట్సాప్‌లోనే..

పూర్వ విద్యార్థులు పలు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేస్తున్నారు. ఈ గ్రూపుల్లో నిత్యం స్నేహితుల యోగక్షేమాలతో పాటు, గ్రామంలో జరుగుతున్న కార్యకలాపాలను కూడా షేర్ చేసుకుంటున్నారు. స్నేహితుల కష్టసుఖాలను తెలుసుకుంటూ అవసరమైన మేరకు మిగిలిన వారిని ఆదుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వాట్సాప్ గ్రూపులు ఉన్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

జాగ్రత్తలూ అవసరమే..

సోషల్ మీడియా ఆసరాగా చేసుకుని కొందరు ఫేక్ ఫ్రెండ్‌షిప్‌లు చేస్తున్నారు. అటువంటి వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతున్నారు. అపరిచితులు పరిచయాలను పెంచుకుంటున్నారు. పరిచయాన్ని స్నేహంగా మలచుకుంటున్నారు. ఆపై స్నేహాన్ని అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం వంటి ఘటనలు చూస్తున్నాం. సోషల్ మీడియా ఫ్రెండ్‌షిప్ పట్ల యువత, ముఖ్యంగా బాలికలు, మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ మొదటికే మోసం తెస్తుండడంతో అపరిచితులతో ఆచితూచి స్నేహం చేయాల్సిన అవసరం కూడా ప్రస్తుత కాలంలో ఉంది. ఇదిలాఉంటే మార్కెట్‌లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ల అమ్మకాలు విరివిగా జరుగుతున్నాయి.




అమ్మకానికి సిద్ధమైన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు

ఇది కదా స్నేహమంటే..

రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 2016 జనవరిలో కలిశారు. తమ బ్యాచ్‌కు చెందిన నలుగురు స్నేహితుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అంతా కలసి ఆర్థిక సాయం అందించారు. నలుగురు విద్యార్థులకు రూ.5.25 లక్షలు అందజేశారు. అలాగే 2016 నుంచి ఏటా రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15న పూర్వ విద్యార్థులంతా కలుసుకుని, పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ఈ విధంగా ఇప్పటి వరకూ రూ.6.50 లక్షలు విద్యార్థులకు అందజేశారు. స్నేహమంటే కలుసుకుని కబుర్లు చెప్పుకోవడం కాదని, మిత్రులకు, సమాజానికి మంచి చేయాలని నిరూపిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా చాలామంది స్నేహహస్తాన్ని అందిస్తున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వండి

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్



అమలాపురం టౌన్: రాష్ట్రంలో ఇటీవల బదిలీ అయిన 60 వేల మంది ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమలాపురంలో శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత జూన్ నెలలో సాధారణ బదిలీల్లో భాగంగా దాదాపు 67 వేల మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం జరిగిందన్నారు. కొందరు స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలుగా, మరికొందరు ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి హెచ్‌ఎంలుగా పంపించిందని గుర్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ సమాన క్యాడర్ బదిలీలు జూన్ 9తో, ఎస్జీటీల బదిలీలు జూన్ 14తో ముగిశాయన్నారు. మరుసటి రోజు అందరూ బదిలీల ప్రకారం కొత్త పాఠశాలలకు వెళ్లి బాధ్యతలు చేపట్టారని వివరించారు. కొందరు ఉన్న క్యాడర్లలోనే స్థానికంగా మారడంతో వారికి వేతనాలు అందాయన్నారు. కానీ పోస్టుతో సహా స్థానచలనం కలిగిన దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలలకు జీతాలు జమ కాలేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ తరఫున ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీలకు రూ.లక్ష విరాళం



కలెక్టర్‌కు రూ.లక్ష విరాళం అందిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్

బోట్‌క్లబ్ (కాకినాడ): స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 5 నుంచి 20 వరకూ జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ హాకీ టోర్నీలకు శ్యామ్ ఇనిస్టిట్యూట్ రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.శ్యామ్, డైరెక్టర్ శైలజా రూ.లక్ష చెక్కును కలెక్టర్ షణ్మోహన్‌కు అందజేశారు. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకుతోపాటు 6,014 పోస్టులకు గాను 4,005 పోస్టులు శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులే సాధించడంతో అధినేత శ్యామ్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్గి... సర్వం బుగ్గి

- చినశంకర్లపూడిలో అగ్ని ప్రమాదం
- ఆరు తాటాకిళ్లు భస్మీపటలం

ప్రత్తిపాడు: ఊరంతా నిశ్శబ్దం.. అందరూ నిద్రలోకి జారుకున్నారు.. ఇంతలో ఒళ్లంతా వేడి సెగలు.. తుల్లిపడిన ఆ కుటుంబాలు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశాయి.. తేరుకునేలోపే ఆరు తాటాకిళ్లు కాలిపోయాయి. సర్వం బుగ్గి అయ్యింది. ఆ పేద కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదం ఆరు కుటుంబాలను నిరాశ్రయులను చేసింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ముంచుకొచ్చిన ముప్పు ఇళ్లను బూడిద చేసింది. చినశంకర్లపూడి హరిజన కాలనీలో బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, పులగపూరి సత్యనారాయణ కుటుంబాలు తాటాకిళ్లలో జీవిస్తున్నారు. వీరంతా వ్యవసాయ కూలీలే.

ఒక్కసారిగా అగ్నికీలలు

ఊరంతా గాఢ నిద్రలో ఉండగా శనివారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో బుర్రి మరిడమ్మ తాటాకింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకున్నాయి. తేరుకునేలోగా మంటలు ఒక్కొక్క ఇంటికి వ్యాపించాయి. ఇళ్లలోని వారంతా బయటకు పరుగులు తీశారు. ఒక ఇంటి నుంచి ఇంకొక ఇంటికి చొప్పున మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, పులగపూరి సత్యనారాయణ ఇళ్లకు మంటలు వ్యాపించాయి. బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, పిరాటి అచ్చారావు ఇళ్లలో వేడిమికి గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతో మంటలు క్షణాల్లోనే ఆరు తాటాకిళ్లను భస్మీపటలం చేశాయి. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె.రాముడు, లీడింగ్ ఫైర్‌మెన్ కేఎస్ఎన్ మూర్తి తమ సిబ్బందితో సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా సుమారు రూ.ఎనిమిది లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రాముడు తెలిపారు.

బాధితులంతా నిరుపేదలే..

ఒంటరి మహిళ బుర్రి మరిడమ్మ ఒక ఇంట్లో ఉంటుండగా, చదువుకుంటున్న ముగ్గురు పిల్లలు, భార్యతో కలసి మానూరి రాజబాబు ఒక ఇంట్లో, భార్య నాగమణితో కలసి ముతకల నాగేశ్వరరావు, భార్యతో కలసి పిరాటి అచ్చారావు, భార్య కుమారుడితో కలసి పిరాటి అప్పారావు, ఒంటరిగా పులగపూరి సత్యనారాయణలు మరో ఇంట్లో జీవిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో ఇంట్లో సమస్తం కాలి బూడిద కావడంతో బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సందర్శించారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, వంట సామగ్రి పంపిణీ చేశారు.



చినశంకర్లపూడిలో అగ్నికి ఆహుతవుతున్న ఇళ్లు



కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



శ్యామలా సెంటర్ వద్ద చెప్పుల దుకాణంలో పొగలు

రూ.16 లక్షల ఆస్తి నష్టం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక శ్యామలా సెంటర్ వద్ద చెప్పుల దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్టేడియం రోడ్డు నుంచి కోటిపల్లి బస్టాండ్‌కు మలుపు తిరిగే ప్రాంతంలో ఆనుకుని ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ సేల్ అనే పేరుతో హైదరాబాద్‌కు చెందిన షేక్ మొహియుద్దీన్, ఆర్ఎస్ దత్తు ఈ చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నారు. ఉదయం 6.40 గంటలకు ఆ దుకాణంలోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేశారు. ప్రమాదానికి దగ్గరలోనే అగ్నిమాపక కార్యాలయం ఉండడంతో వెంటనే ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. నగరంలోని ఆర్యాపురం, ఇన్నీసుపేట అగ్నిమాపక యంత్రాలతో పాటు కొవ్వూరు నుంచి మరో వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో చెప్పుల దుకాణానికి ఆనుకుని ఉన్న బాలాజీ అక్వేరియం, పెట్స్ దుకాణం అగ్ని ప్రమాదానికి గురైంది. సుమారు రూ.16 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని తెలిపారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి సీహెచ్ మార్టిన్‌లూథర్ కింగ్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మంటలను చాకచక్యంగా అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బందిని ఆయన అభినందించారు.

ప్రవర్తన నియమావళిపై పట్టు సాధించాలి



ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న కొత్తపేట ఎంపీడీఓ నరేష్‌కుమార్

సామర్లకోట: ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి (సీసీఏ)పై ఎంపీడీఓలు పట్టు సాధించాలని కొత్తపేట ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఆరో రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కుమ్మక్కు అయినట్లు రుజువైతే శిక్ష ఉంటుందన్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పులు చేసిన సమయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారిని సస్పెండ్ చేసే అధికారం ఉంటుందన్నారు.

అయస్కాంతాన్ని మింగేసిన బాలిక



బాలిక మింగేసిన అయస్కాంతం ముక్క



వైద్య సేవలు పొందుతున్న మాడెం రమ్య

తొలగించిన వైద్యులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోట గ్రామ పంచాయతీ బాపన్నధార గిరిజన గ్రామానికి చెందిన మాడెం రమ్య ఓ తినుబండారం ప్యాకెట్‌లో ఉన్న అయస్కాంతం ముక్కను మింగేసింది. ఆ బాలికను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి దానిని వైద్యులు తొలగించారు. మాడెం రమ్య బురదకోటలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. రింగ్ ప్యాకెట్లు తినే అలవాటు ఉన్న బాలిక ఆ ప్యాకెట్‌లోని తిను బండారాలతో పాటు అయస్కాంతం ముక్కను కూడా మింగేసింది. ఆమెను ప్రత్తిపాడు, ఏలేశ్వరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించగా ఫలితం లేకపోవడంతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అయస్కాంతం ముక్కను తొలగించారు. ఈ అంశంపై సంబంధిత రింగ్ కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని బాలిక తల్లిదండ్రులు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ ఓపెన్ టెన్త్, ఇంటర్ వన్‌సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్ : 82975 92043, 99494 82757 [V- 2846]

Real Estate

REAL ESTATE

■ కాకినాడ గుడారిగుంట గేటెడ్ కమ్యూనిటీలోని 4BHK విల్లా ఆఫీసులకు బిజినెస్ & ఫుల్లీ ఫర్నిష్డ్ రెసిడెన్స్ పర్పస్ అద్దెకు. ✆ : 96038 59774 [SCA25006774]

GODOWN FOR SALE

■ కాకినాడలో 30 సెంట్లు (1457 చ॥గ॥)లో 8000 చ॥అ॥ మొత్తం లేదా విడిగా (4x355 చ॥గ॥లు) నెలకు 1 లక్ష పైగా అద్దెలు వచ్చే కమర్షియల్ గొడౌన్ అమ్మకమునకు కలదు. ✆ : 99493 43008 [R-64]

BUILDING & CONSTRUCTIONS

■ AP LRS-2025 ద్వారా నాన్ లేఅవుట్ స్థలాలు క్రమబద్ధీకరించేందుకు ఇదే సువర్ణ అవకాశం. త్వరపడండి. Anciscon Infratech, Architects & Engineers (AP & TS) Contact: ✆ +91 94917 55456 [SCA25006889]

FLAT FOR SALE

■ కాకినాడ-విద్యానగర్ గ్యాస్ కంపెనీ ప్రక్కన హనీ శ్రీ ఎన్‌క్లేవ్ నందు GF+1, 2 BHK ఫ్లాట్ ఫుల్లీ ఫర్నిష్‌తో అమ్మకం. నో మీడియేటర్స్. ✆ 94907 89177, 99498 82199 [B-174]

HOUSE FOR SALE

■ కాకినాడ APSP ఎదురుగా అవంతినగర్ S/F బిల్డింగ్, E/F బిల్డింగ్ బ్యాంక్‌లోన్‌తో అమ్మకము. మరియు హంసవరం హైవేకి 1 కి.మీ. లోపల 30 సెంట్లు భూమి అమ్మకము ✆ : 99121 30247 [R-62]

■ రాజమండ్రి H.B. కాలనీ ఎదురుగా, ఫారెస్ట్ ఆఫీస్ ప్రక్కన, 3BHK, 2 హాల్స్, డూప్లెక్స్ విల్లా అమ్మకం. కొంతమూరు ప్రకాశం ఎంప్లాయిస్ కాలనీలో (8Yrs old) S/F. 137 చ॥గ॥ల్లో ఇండివిడ్యువల్‌హౌస్ అమ్మకం. ఫోన్ 94944 88294. నో బ్రోకర్స్. H [V-2845]

■ రాజమండ్రి, ఆనందనగర్ E/F, 110 గజాల డూప్లెక్స్ బిల్డింగ్, కొంతమూరు కళ్యాణ్ నగర్‌లో N/F, 175 గజాల బిల్డింగ్ & పరిమినగర్‌లో S/F, 150 గజాల బిల్డింగ్స్ & ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ : 90144 68992 [R-63]

LAND FOR SALE

■ కడియం, బుర్రిలంక హైవేకి దగ్గరలో ఒక ఎకరం భూమి అమ్మకమునకు కలదు. ఫంక్షన్ హాల్ కి / స్కూల్స్ / కాలేజ్‌లకి అనువైనది. సెంటు 8 లక్షలు. ✆ : (C) 94402 37253 [SCA25006245]

PLOT FOR SALE

■ కమర్షియల్ స్థలములు అమ్మకం. రాజమండ్రి కార్పొరేషన్ పరిధిలో కోలమూరు ఎయిర్ పోర్ట్ రోడ్డుకి చేర్చి 323 చ॥గ॥లు, 800 చ॥గ॥ల,స్థలములు అమ్మకం. 90008 39911. [SCA-25006497]

■ Kakinada, Pallamrajunagar, 650 Sq.Yards, 2000 Sq.ft Built up area. Main Road, East facing, Two side Road (Suitable for commercial and residential purposes) Plot for sale. Cont: 93486 20525/ 9160624777 [SCA-25006700]

■ కాకినాడ, సర్పవరం, ట్రస్ట్ హాస్పిటల్ దగ్గరలో SBI గైగోలపాడు బ్రాంచ్ దగ్గరలో ఉన్న గన్ని వారి వీధిలో (విజయ గార్డెన్స్) 399 చ॥అ(91'. 3"×39'.3") స్థలముతో పాటు (చిన్న watchmen షెడ్) H. No:3-44/1 (plot no:11p) అమ్మకమునకు కలదు. SPOT REGISTRATION, NO BROKERS. ✆ : 95502 63028 [SCA25006385]

■ రాజమండ్రి J. N రోడ్డులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంకి ఆనుకుని ఉన్న వీధిలో మంతెన గార్డెన్స్, సాయికృష్ణ గాయత్రి అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న LRS APPROVED తూర్పు ఫేసింగ్ 90'×45'(450 చ॥అ) ఖాళీ స్థలం అమ్మబడును. స్కూలుకి, హాస్పిటల్‌కి, రెసిడెన్స్‌కి suitable. SPOT RIGISTRATION NO BROKERS ✆ : 98481 69562, 95502 63028 [SCA25006384]

LEASE / RENT

■ రాజమండ్రి, హుకుంపేటలో మెయిన్ రోడ్డుకి ఆనుకుని మినీ ఫంక్షన్ హాలు లీజుకు కలదు.ప్రేయర్ హోంలకు / మినీ ఫంక్షన్లకు అనువైనది. ✆ : 94402 37253 [SCA25006969]

■ RENT 2BHK srinivasnagar 1st street towads Rayudupalem, Vakalapudi kkd. furnished with 2ACs, 1Geyser, 1Chimney & 7CC cemeras ✆ : 99515 58185 [R-SCA 25006894]

TO-LET

■ 3BHK ఫ్లాట్ అద్దెకు RJY భవ్య అపార్ట్‌మెంట్ 1st ఫ్లోర్, బ్రదరన్ చర్చి ఎదుట కోరుకొండరోడ్ ICICI బ్యాంక్ ప్రక్కన గలది అద్దెకు Contact. ✆ : 94401 79277 [R-7677]

■ కాకినాడ, సర్పవరం జంక్షన్ మెయిన్ రోడ్‌లో S/W కార్నర్ 3 ఫ్లోర్స్ కమర్షియల్ బిల్డింగ్ షోరూమ్, రెస్టారెంట్, షాప్స్, బ్యాంక్, ఆఫీస్, క్లినిక్‌లకు అద్దెకు కలదు. ✆ : 99493 43008 [R-65]

Services

FACTORY FOR SALE

■ A.P. జగ్గయ్యపేట బైపాస్ రోడ్డులో రన్నింగ్ కండీషన్‌లో ఉన్న CRAFT పేపర్ మిల్లు 12 కోట్లకు అమ్మబడును. లోన్ సౌకర్యం కలదు ✆ 98482 75523 [SCA25006927]

Wanted

■ కాకినాడ రెస్టారెంట్‌కి మాస్టర్స్ (బిర్యాని & చైనీస్), హెల్పర్స్ (M/F), జ్యూస్, చెరుకు రసం బాయ్, టీ & టిఫిన్స్ మాస్టర్స్, మిల్క్ పార్లర్ అసిస్టెంట్స్ & ట్రక్ డ్రైవర్ కావలెను. ✆ : 99493 43008 [R-66]

■ Reputed Banks కాకినాడ నందు Managers కావలెను. Incentives, Foreign Trip సదుపాయం కలదు. సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఆఫీసర్స్, 50 సం॥లు నిండిన హౌస్‌వైఫ్స్ అర్హులు ✆ : 98487 90024 [R-67]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు.ఫ్రీరూమ్+భోజనం.Hyd.9666253675 [HA-16118]

కావలెను

ఆదిత్య యూనివర్శిటీ

సూరంపాలెంలో పనిచేయుటకు

అసిస్టెంట్ చీఫ్ వార్డెన్స్, వార్డెన్స్

(MALE / FEMALE)

- ఏదైనా డిగ్రీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండవలెను.
- మంచి తెలుగు, ఇంగ్లీషు మరియు హిందీ కమ్యూనికేషన్ స్కిల్ కలిగి ఉండవలెను.
- ఉచిత భోజన, వసతి సదుపాయం

70361 76661, 90100 26664

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/మగ/జంట కావలెను. ఫోన్: 9347556162 / 8309615249 [HA-58956]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205

కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం : 99516 02838

తుని, జగ్గంపేట, యానాం : 90109 67896

అమలాపురం, ముమ్మిడివరం : 97053 47414

పి.గన్నవరం : 97057 49718, రాజోలు : 97053 46456

మండపేట : 99516 02941

రామచంద్రపురం : సెల్ : 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010